క్లుప్తంగా

స్థల ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ స్వర్ణకుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు లక్ష్మి

గంట్యాడ: ప్రభుత్వం తనకు మంజూరు చేసిన స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని, దీనిపై ప్రశ్నిస్తే చంపేస్తానని బెదిరిస్తున్నాడని రామవరానికి చెందిన ఓ మహిళ మంగళవారం తహసీల్దార్ కె.స్వర్ణకుమార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2010 సెప్టెంబర్ 30న పంచాయతీ తీర్మానం చేసి తనకు పట్టా ఇచ్చారని పీరుబండి గంగు లక్ష్మి తహసీల్దార్‌కు తెలిపారు. ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన పీరుబండి ప్రకాష్ రావు అక్రమించి నిర్మాణం చేపట్టేందుకు ఆ స్థలంలో రాళ్లు వేశారని, ఎందుకు వేశారని అడిగితే చంపేస్తానని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ.. విచారణ చేసి తగిన చర్య లు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నర్సింహమూర్తి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి: డీపీఓ

దత్తిరాజేరు: ఈనెల 25న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు వస్తున్నందున మరడాం, కుంటినవలస గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై అధికారులు, కార్యదర్శులు దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా అన్నారు. మరడాం గ్రామ సచివాలయంలో మెంటాడ, దత్తిరాజేరు మండలాల కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రోడ్లుకు ఇరువైపులా చెత్తా చెదారాలను, డ్రైనేజీల్లో పూడికలు తొలగించి బ్లీచింగ్ వేయించాలన్నారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని సూచించారు.

ఆర్థిక నిర్వహణపై శిక్షణ

కొత్తవలస: మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఆర్థిక నిర్వహణపై మంగళవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైకేపీ ప్రాంతీయ సమన్వయకర్త ఎస్.ఆదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరు మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు. మండల సమాఖ్య, గ్రామ సమైక్యలు ఆర్థికంగా బలోపేతమై సుస్థిరత సాధించడం కోసం అవలంబించాల్సిన పద్ధతులు, మార్గాలపై అవగాహన కల్పించారు. ఆర్థిక నిర్వహణపై సిబ్బంది అనుసరించాల్సిన ప్రణాళికలను వివరించారు.

ఆర్థిక సాయం అందజేత

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెం గ్రామానికి చెందిన సిమ్మ దేముడమ్మ కిడ్నీ సమస్యతో బాధపడుతుండడంతో అదే గ్రామానికి చెందిన యల్లమాంబ యూత్ సభ్యులు రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం బాధితురాలికి అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన బంగారయ్య మృతి చెందడంతో దహన సంస్కారాల నిమిత్తం మృతుని భార్య కానూరి దేముడమ్మకు రూ.5 వేలు అందజేశారు. యూత్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

పంట క్షేత్రాల సందర్శన

శృంగవరపుకోట: మండలంలోని సంతగవిరమ్మపేట యూనిట్‌లో సంతగవిరమ్మపేట, వినాయకపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరిపంట పొలాలను డీపీఎం ఆనందరావు మంగళవారం క్షేత్ర పరిశీలన చేశారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. జీవామృతం, కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. వాటి వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి వనరుల కేంద్రం ద్వారా ద్రావణాలు, కషాయాలు రైతులకు సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వీఏఏ రవి, అరిగి ఈశ్వరమ్మ, సిరిపురపు రాము పాల్గొన్నారు.

వృద్ధులకు భోజనాలు పంపిణీ



ఎస్.కోట: ఆశ్రమంలో వృద్ధులకు భోజనాలు అందిస్తున్న మెగాస్టార్ అభిమానులు

శృంగవరపుకోట: సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణానికి చెందిన మెగా పవర్ సేవా సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జీసీసీ రోడ్డులో ఉన్న దివ్యాంగులు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. పలువురికి బిస్కెట్లు, పండ్లు పంచిపెట్టారు. అలాగే ఇటీవల ఆటో ప్రమాదంలో గాయపడిన పృథ్వీ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రమణ, చిన్ని, చంటి, కిరణ్, సతీష్, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: మండల కేంద్రంలో మాజీ మంత్రి పడాల అరుణ నివాసం వద్ద మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి అక్కడున్న వారందరికీ పంచిపెట్టారు.

• గౌరీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: శ్రావణమాసం సందర్భంగా మండలంలోని దేవుపల్లిలో వెలసిన రాజరాజేశ్వరీదేవి అమ్మవారు మంగళవారం గౌరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారికి పంచామృతాభిషేకంతో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి గౌరీదేవిని దర్శించుకున్నారు.

• ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

జామి: మండలంలోని కుమరాంలో వెలసిన ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆయంలో మంగళవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకుడు

• గ్రామదేవతలకు మొక్కుల చెల్లింపు



వీలుపర్తిలో పైడితల్లమ్మకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ, బక్కునాయుడుపేట గ్రామాల్లో మంగళవారం గ్రామదేవతల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు పైడితల్లి, పరదేశమ్మ అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఏటా వరినాట్లు పూర్తయ్యాక పంట సమృద్ధిగా పండాలని కోరుకుంటూ గ్రామదేవతలకు చీర చూపించి పసుపు, కుంకుమతో పూజలు చేయడం పూర్వికుల నుంచి సాంప్రదాయంగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు గ్రామానికి చెందిన ఆర్.దేముడునాయుడు, కె.అచ్చిబాబు తమ సొంత నిధులతో పులిహోరా, మజ్జిగ పంపిణీ చేశారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే టీడీపీ లక్ష్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: ఉత్తరాంధ్రతో పాటు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధికి అడ్డుపడటమే టీడీపీ నాయకుల లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి కోసం పట్టించుకోరని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తే అడ్డుపడుతుంటారని మండిపడ్డారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమ నెలకొల్పేందుకు ప్రభుత్వం భూములు ఇచ్చిందన్నారు. పరిశ్రమలు ఏర్పడితే ఉపాధి కల్పన జరుగుతుందన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రోత్‌సెంటర్‌లో కేటాయించిన భూములు పరిశ్రమలు ఏర్పాటుకు తప్ప మరేఇతర కార్యక్రమాలకు పనికిరావని స్పష్టం చేశారు. గ్రోత్ సెంటర్‌లో ఎవరు పరిశ్రమలు నెలకొల్పేందుకు సిద్ధమైనా ప్రభుత్వం భూములు ఇస్తుందన్నారు. టీడీపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే పరిశ్రమ పెట్టేందుకు సిద్ధమైతే అత్యంత తక్కువ ధరకే గ్రోత్‌సెంటర్‌లో భూములు తమ ప్రభుత్వం ఇస్తుందన్నారు. టీడీపీ రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు కుటుంబానికి రణస్థలంలో 2015లో టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.4 లక్షలకే 9 ఎకరాలు రెవెన్యూ భూమిని కట్టబెట్టిన సంగతి ఆ కుటుంబ సభ్యుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున తెలుసుకోవాలన్నారు. ఆ భూముల్లో కిమిడి కళావెంకటరావు కుమారుడు రామ్‌మల్లిక్‌నాయుడు ఎలాంటి పరిశ్రమ పెట్టకపోగా తిరిగి వాటిని అమ్ముకునేందుకు చూసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క పరిశ్రమనైనా జిల్లాకు తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయంగా బురద జల్లే పనులు మానుకోవాలని హితవు పలికారు. పార్టీ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, బెల్లాన త్రినాథరావు, పతివాడ రాజారావు, చందక గురునాయుడు, కరిమజ్జి శ్రీనివాసరావు, కోరాడ పృథ్వీ, కోరుకొండ దాలయ్య ఉన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



మరడాం-కుంటినవలస మధ్య జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ చిన్నశ్రీను

దత్తిరాజేరు: గిరిజన యూనివర్సిటీకి భూమిపూజ చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 25న జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో సీఎం సభ ఏర్పాట్లను డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. మెంటాడ మండలం కుంటినవలస వద్ద శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించనున్నారు. అక్కడ నుంచి దత్తిరాజేరు మండలం మరడాం వద్ద ఏర్పాటు చేసిన సభావేదికకు రోడ్డుమార్గంలో చేరుకుంటారు. సభావేదిక వరకు రోడ్డు విస్తరణ పనులను డిప్యూటీ సీఎం, జెడ్పీ చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు కిలోమీటర్ల మార్గంలో నాలుగు కేంద్రాల వద్ద గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. హెలీప్యాడ్ పనులు పూర్తి కావచ్చాయని తెలిపారు. వారి వెంట మెంటాడ, దత్తిరాజేరు ఎంపీపీలు రెడ్డి సన్యాసినాయుడు, గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

• ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక

గజపతినగరం: మండల కేంద్రంలోని జనశిక్షణ సంస్థాన్‌లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా అందిస్తున్న శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. బ్యూటీ కేర్ అసిస్టెంట్ కోర్సులో శిక్షణ పొందిన మహిళలకు స్థానిక పాత మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఇటువంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నిరుద్యోగ యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి శ్రీదేవి, జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ వి.హరీష్, పీఓ కోటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ జి.గణేష్, ఆర్పీలు జి.ఉమామాధవి, బి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



గజపతినగరం: కెంగువలో రోగులను వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సుష్మ



దత్తిరాజేరు: కన్నాంలో వృద్ధులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

గజపతినగరం: నియోజకవర్గంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం పక్కాగా అమలవుతోంది. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారు. గజపతినగరం మండలం కెంగువలో మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కె.సుష్మ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 86 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఆరోగ్య కార్యకర్త కళావతి, ఆశా వర్కర్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మండలంలోని కన్నాం గ్రామంలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 71 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించారు.

ప్రతీ ఇంటికి సంక్షేమం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఆ పార్టీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, కె.హర్షవర్ధన్‌రాజు అన్నారు. మండలంలోని సొలిపిసోమరాజుపేటలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. పేదలందరికీ మంచి చేయాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, ఎంపీటీసీ గిడిజాల రాజారావు, వైస్ సర్పంచ్ గుంటమాని గోవింద్, పార్టీ నాయకులు నారాయణప్పుడు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

గంట్యాడ: వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. వలంటీర్‌గా ఎంపికైన మహిళకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అర్హులకు పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లు మంజూరు

గుర్ల: మండల పరిషత్ కార్యాలయ నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి 50 లక్షలు మంజూరు చేసిందని ఎంపీపీ పొట్నూరు ప్రమీల మంగళవారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయం పదేళ్లుగా శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులూడుతున్న భవనాల్లోనే ఉద్యోగులు విధులు నిర్వహించేవారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా మంత్రికి, జెడ్పీ చైర్మన్‌కు ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు.

సచివాలయాల్లో డిజిటల్ చెల్లింపులు

బొండపల్లి: మండలంలోని అన్ని సచివాలయాల్లో ఆగస్టు 15 నుంచి డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టినట్లు ఈఓపీఆర్డీ సీహెచ్ సుగుణాకరరావు తెలిపారు. సచివాలయాల్లో వివిధ సేవలకు గాను ఇంతవరకు నగదు చెల్లింపులకు మాత్రమే అవకాశం ఉండేదని, ఇక నుంచి డిజిటల్ (ఆన్‌లైన్ ద్వారా) విధానంలో నగదు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. దీని వలన ప్రజలకు మరింత మెరుగైన సేవలు సులభంగా పొందేందుకు వీలుంటుందన్నారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి

వేపాడ: సమగ్ర శిక్ష సొసైటీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఉద్యోగులు ఎంఇఓ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, జూలై నెల వేతనాలు విడుదల చేయాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

డ్వాక్రా సంఘాలకు ఆర్థిక క్రమశిక్షణ అవసరం

• వెలుగు ఏసీ బంగారమ్మ



మాట్లాడుతున్న ప్రాంతీయ సమన్వయకర్త బంగారమ్మ

చీపురుపల్లి: స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరమని వెలుగు గరివిడి క్లస్టర్ ప్రాంతీయ సమన్వయకర్త బి.బంగారమ్మ అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం వెలుగు కార్యాలయంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులకు, సీసీలకు ఆర్థిక యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన ప్రాంతీయ సమన్వయకర్త బంగారమ్మ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామైక్య సంఘం ఏ గ్రేడులో ఉండాలని సూచించారు. ఆర్థిక పరమైన అంశాలపై వీఓఏలు సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. రుణాల చెల్లింపులో క్రమశిక్షణ పాటించడం ద్వారా బ్యాంకుల వద్ద రుణ పరపతి పెరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాలు ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసుకుని సంఘ పురోగతి కోసం చర్చించుకునే విధంగా వీఓఏలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎంవీ రాజశేఖర్, ఎఫ్‌పీఓ ఏపీఎం అన్నపూర్ణ, ఎల్‌సీ దుర్గాప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షురాలు పనస సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయండి



గ్రామీణ వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్

గజపతినగరం: రైతులు, కూలీలు పొలం పనులు చేసే సమయంలో పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉన్నందున వారంతా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వెంకటేష్ అన్నారు. స్థానిక సాయి బాలాజీ ఆస్పత్రిలో పీఎంపీ ఎల్.ఎస్.నాయుడు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి ఆర్‌ఎంపీ, గ్రామీణ వైద్యుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ.. పాముకాటుకు గురైన వ్యక్తిని ఆందోళనకు గురిచేయకుండా వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో సదుపాయాలు పెరిగాయని, ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం డాక్టర్ ప్రసన్నకుమారి మాట్లాడుతూ ఈ సీజన్‌లో మలేరియా, డెంగీ, తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి, జోనల్ ఉపాధ్యక్షుడు ఎ.త్రినాథరావు, కె.పైడిరాజు, ట్రెజరర్ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



పిల్లపేటలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

చీపురుపల్లి: మేజర్ పంచాయతీ పరిధిలో దోమల నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. పిల్లపేట, కస్పావీధి, రుంకానవీధి, చిలుకూరివీధి, జి.అగ్రహారం, మెయిన్‌రోడ్, డైలీ మార్కెట్ తదితర ప్రాంతాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

సంక్షిప్తంగా...

వైఎస్సార్ బీమాతో ఆర్థిక భరోసా..

చీపురుపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ బీమా పథకం ద్వారా పేద కుటుంబాలకు సామాజిక భద్రత లభిస్తోందని బెల్లాన వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని హడ్కోకాలనీకు చెందిన తామరాపల్లి శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయలు మంజూరు చేసింది. తక్షణ సాయంగా రూ.10 వేలును మృతుడి తల్లి రమణమ్మకు మంగళవారం అందజేశారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సూరు దుర్గారావు, ఒమ్మి రమేష్, పీతల మురళి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ దరఖాస్తుల వెరిఫికేషన్

బొండపల్లి: కొత్త పింఛన్ల కోసం అందిన దరఖాస్తులను ఎంపీడీఓ వై.వి.రాజేంద్రప్రసాద్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని గొట్లాం గ్రామ సచివాలయం పరిధిలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి వారి అర్హతలను వెరిఫై చేశారు. అర్హులకు పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉన్నారు.

సీసీరోడ్డు పరిశీలన

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం పంచాయతీ మధుర గ్రామమైన గోపన్నవలస గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డును పీఆర్ ఏఈ హరికృష్ణ మంగళవారం పరిశీలించారు. రహదారి కొలతలు తీసుకుని, నాణ్యతను పరీక్షించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన నిధులు రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మించారు.

ఆధార్ అప్‌డేషన్‌కు అవకాశం

మెరకముడిదాం: ఆధార్‌కార్డులో తప్పులను సవరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మండలనికి చెందిన ప్రజలు తమ ఆధార్‌కార్డులో తప్పుల సవరణకు మెరకముడిదాం, గర్భాం, సాతాంవలస సచివాలయాల్లో సంప్రదించాలని ఎంపీడీఓ ఎం.రత్నం తెలిపారు. మంగళవారం నుంచి ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు చెప్పారు.

ఓటర్ల జాబితా పరిశీలన

జామి: జనవరి 6 నుంచి నేటివరకు జరిగిన ఓటర్ల తొలగింపుపై మంగళవారం నియోజకవర్గం పరిశీలకుడు డీసీఓ పి.రమేష్ పునఃపరిశీలన చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల తొలగింపు కోసం వచ్చిన క్లయిమ్స్‌ను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పరిశీలన చేసినట్లు తెలిపారు. ఇటీవల చేపట్టిన ఇంటింటి సర్వేలో ఓటర్ల చేర్పులు, తొలగింపులపై ఆరా తీశారు. ఆయనతో పాటు తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ ఉన్నారు.

పాఠశాల తనిఖీ

వేపాడ: మండలంలోని శింగరాయి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టీలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, సమ్మెటివ్ పరీక్ష ప్రశ్నపత్రాలు, వర్క్‌బుక్స్, తదితర వాటిపై ఆరా తీశారు. రాగిజావ అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదులకు వెళ్లి 4,5 తరగతుల విద్యార్థులకు గణితం బోధించారు. అనంతరం నీలకంఠరాజపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఎంఈఓ వెంట సీఆర్‌పీ సునంద, రాంప్రసాద్ ఉన్నారు.

వైకేపీ ఉద్యోగుల హర్షం



ఎమ్మెల్యే శ్రీనివాసరావును సన్మానిస్తున్న వైకేపీ ఉద్యోగులు

కొత్తవలస: వేతనాలు 23 శాతం పెంచడంపై వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలోని సంతపాలెంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ ఆదయ్య, ఆరు మండలాల ఏపీఎంలు, సిబ్బందితో పాటు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపీపీ ఎన్.గోపమ్మ, సర్పంచ్ బొడ్డి చాముండేశ్వరి, ఎంపీటీసీ వెలగల రమణ, తదితరులు ఉన్నారు.